క్వీన్‌మేరీ.. వర్రీ



శిథిలావస్థలో క్వీన్‌మేరీ పాఠశాల

కూలేందుకు సిద్ధంగా చారిత్రక భవనం

- చాలీచాలని గదుల్లో విద్యార్థినులకు బోధన
- ఆరు బయటే భోజనాలు

విశాఖ చారిత్రక సంపదలో క్వీన్‌మేరీ పాఠశాల భవవనం ప్రముఖమైనది. 1817లో మద్రాస్ ప్రెసిడెన్సీలోని వైజాగ్ పటం కేంద్రంగా బ్రిటిష్ అధికారులు ఉత్తరాంధ్ర పర్యటనలు చేసేవారు. అప్పట్లో అనాథశ్రమం కోసం ఈ భవనం నిర్మించారు. వితంతువుల కోసం ప్రత్యేకంగా ఈ భవనం నిర్మించారు. సతి వ్యవస్థ రద్దు చేసిన తర్వాత, వితంతువులకు పాఠశాలలకు పంపేవారు. వారిపై ఉన్న కళంకం కారణంగా, సాధారణ అమ్మాయిలు తమ పక్కన కూర్చోవడం అసౌకర్యంగా భావించేవారు. దీంతో వారి అభ్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని బ్రిటిష్ అధికారులు ఈ భవనంలోనే ఆశ్రయం కల్పించి చదువు చెప్పించేవారు. ఆ తరువాత ఈ భవనం మెడికల్ స్టోర్‌గా, మెడికల్ స్కూల్‌గా, హార్బర్ ఆఫీసుగా, స్వచ్ఛంద ఆయుధ కారాగారంగా, కలెక్టర్ ఖజానా కార్యాలయంగా సేవలందించింది. 1973 నుంచి 1914 వరకు కలెక్టర్ పేషీగా ఈ భవనాన్ని వినియోగించారు. 1950 తరువాత ఈ భవనంలో క్వీన్ మేరీ పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 1001 మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారు. క్వీన్ మేరీ స్కూల్‌కు చారిత్రాత్మక చిహ్నంగా, విద్యాకేంద్రంగా విశాఖ చరిత్రలో విశిష్ట స్థానం ఉంది. అయితే ప్రస్తుతం భవనం శిథిలావస్థలో ఉండడం విచారకరం.

జగదాంబ: చరిత్ర కలిగిన క్వీన్‌మేరీ పాఠశాల ప్రస్తుతం సమస్యలతో కుమిలిపోతోంది. వందల సంవత్సరాలుగా సేవలందించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. దక్షిణ నియోజక వర్గంలోని 39వ వార్డు పాతనగరం కోటవీధి దరిలో ఉన్న పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనీస పర్యవేక్షణ లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. అరకొర సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం కోసం డైనింగ్ హాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షం పడితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది.

పురావస్తు శాఖకు అనుమతులు ఉండాలనే నెపంతో..

పాతభవనాలు నేలకూల్చాలంటే పురావస్తు శాఖ రాజమండ్రి (ఆర్కియాలజీ) అనుమతులు ఉండాలనే నెపంతో ఇప్పటివరకు ఆ భవనాన్ని కనీసం పట్టించుకోలేదు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ఈ చారిత్రక భవనం వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రస్తుతం భవనంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. 1001 మంది విద్యార్థులు నిత్యం భయంభయంగా విద్యనభ్యశిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా శిథిల భవనం పరిస్థితి అధికారుల దృష్టికి ఎందుకు తీసుకువెళ్లడం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



ఉపాధ్యాయుల కార్లు పార్కింగ్‌గా మారిన పాఠశాల భవనం



వర్షం కారణంగా పాఠశాల వరండాలోనే విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలు (ఫైల్)

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నాడు–నేడు పథకంలో అదనపు భవనాలు నిర్మించారు. విద్యార్థులకు భోజన శాలకు తాత్కాలిక ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యాం, అన్ని తరగతులకు ఉపాధ్యాయుల నియామకం చేపట్టారు. నాడు–నేడు రెండో విడత పనులు జరగాల్సి ఉండగా ఎన్నికలు రావడం..కూటమి అధికారంలోకి రావడంతో క్వీన్‌మేరీ పాఠశాలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. నాడు–నేడు రెండో విడత పనులకు కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో బ్రేక్ పడింది. ప్రస్తుతం ఈ పాఠశాల బాగోగులను పట్టించుకోవడం లేదని విద్యార్థినులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నుంచి పది తరగతి వరకు విద్యనభ్యసించేందుకు ఉన్న గదులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఉండే ఈభవనం ఇప్పుడు కూలేందుకు సిద్ధంగా ఉంది.

వారే నిర్ణయం తీసుకోవాలి



గత ప్రధానోపాధ్యాయులు కూడా పాఠశాల భవనం శిథిలావస్థ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. భవన పునఃనిర్మాణం కోసం రాజమండ్రి పురావస్తు శాఖకు నివేదిక కూడా అందజేశాం. అయితే ఇప్పటికీ ఎటువంటి అనుమతులు రాలేదు. కలెక్టర్‌కు కూడా అనుమతులు ఇచ్చే అధికారం ఉంది.

–వి.జోగేంద్రనాథ్, క్వీన్‌మేరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జీవీఎంసీ 39వ వార్డు

క్లుప్తంగా

మానసిక ప్రశాంతత అవసరం



మాట్లాడుతున్న ప్రభుత్వ మానసిక ఆరోగ్యశాల డాక్టర్ రామిరెడ్డి

మహారాణిపేట: పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రపంచ మానసిక ఆరోగ్య ఫెడరేషన్ పిలుపు నిచ్చిందని చిన వాల్తేరు ప్రభుత్వ మానసిక వైద్యాలయం ప్రధాన వైద్యాధికారి కె.వి. రామిరెడ్డి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మానసిక ఆందోళనకు దూరంగా ఉండాలన్నారు. విశాఖ సైకియాట్రిక్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ ఎం.విజయలక్ష్మి, విశాఖ సైకియాట్రిక్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ప్రసన్న కుమార్ తదితరులు మాట్లాడారు.

6న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సమావేశం

మద్దిలపాలెం: ఈ నెల 6న ఉదయం 10 గంటలకు డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ హాల్‌లో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు. సొసైటీలో కొత్తగా చేరాలనే వారు కూడా పాల్గొనవచ్చని చెప్పారు. గోవా ఫిల్మ్ ఫెస్టివల్ డెలిగేట్స్ ఎన్నిక ఈ సమావేశంలో జరుగుతుందన్నారు. వివరాలకు 90324 77463 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వరద బాధితులకు విరాళం



ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావుకు చెక్కు అందిస్తున్న ప్రైవేట్ కళాశాల యాజమాన్యం

మద్దిలపాలెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం అనకాపల్లికి చెందిన ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం విరాళం అందించింది. ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు గురువారం రూ.25 వేల చెక్కును అందించారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టి.వి.కృష్ణ, అసోసియేట్ డీన్ ఎ.ఆర్.ఎస్.హనుమాన్, ఆయా కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం కప్పరాడ కొండవాలు ప్రాంతంలో గురువారం సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్, సీపీఎం కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మికులకు పట్టణ ఉపాధి హామీ పథకం మంజూరు చేయాలని కోరారు. ఉచిత ఇసుక జీవోలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎ.చంటి, ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, కె.సత్యనారాయణ, రామునాయుడు పాల్గొన్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహణ భేష్

మురళీనగర్ : వైశాఖి స్పోర్ట్స్ పార్కు నిర్వహణ ఆదర్శవంతంగా ఉందని ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. పార్కును ఆయన గురువారం సందర్శించారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ సందర్శకులకు, వాకర్స్‌కు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు వాటిని పరిశీలిస్తున్నామని చెప్పారు. స్విమ్మింగ్ పూల్, మట్టితో ఇటీవల నిర్మించిన అధునాతన వాకింగ్ ట్రాకు, స్కేటింగ్ రింగ్ నిర్వహణను సీఐకు వివరించారు.

వ్యాసరచన పోటీల్లో మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: గాంధీ జయంతి పురస్కరించుకొని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ సాధించారు. స్వచ్ఛత ఏ లైఫ్ స్టైల్ ఫర్ సస్టెన్‌బుల్ ఎన్విరాన్‌మెంట్ పేరిట నిర్వహించిన వ్యాసరచన పోటీలో టి.పూజిత (ప్రథమ), కె.రేణుక(ద్వితీయ), ఎన్.మమత (తృతీయ) స్థానాల్లో నిలిచారు. అలాగే అంబేడ్కర్ ఫిలాసఫీ పేరిట నిర్వహించిన పోటీలో పి.భవ్య ధరణి (ప్రథమ), ఎస్.ఉషారాణి (ద్వితీయ), జె. భావన (తృతీయ) స్థానాల్లో నిలిచారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల గురువారం అభినందించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలు, పోటీతత్వం అభివృద్ధి చేసుకునేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇగ్నో కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి.సంతోషి అనూష తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

సీతమ్మధార : జీవీఎంసీ 55వ వార్డులో ఆక్రమణల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తాము వార్డులోని ధర్మానగర్ శివాలయం వీధిలో నివసిస్తున్నామని, ఆ ప్రాంతంలో రోడ్ల మీద పాన్ షాపులు, సోడా షాపులు, కార్ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని విచారం వ్యక్తం చేశారు.

వంతెనపై విద్యుత్ వెలుగులు

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం రైల్వే స్టేషన్ నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ రహదారిలో నేతాజీ ఫ్లైఓవర్ పై విద్యుత్ దీపాలకు మోక్షం కల్గింది. వంతెనపై నెల రోజులు నుంచి విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో వాహనదారులు, వాకర్స్, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సెప్టెంబర్ 24న 'సాక్షి' దినపత్రికలో 'అంతటా అంధకారం' అనే శీర్షికన కథనం వెలువడింది. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆదేశాల మేరకు సంబంధిత జీవీఎంసీ విద్యుత్ లైట్ల విభాగాధికారులు స్పందించారు. గురువారం నేతాజీ వంతెనపై విద్యుత్ లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు. భారీ క్రేన్ సాయంతో సిబ్బంది విద్యుత్ దీపాలు అమర్చారు. దీంతో సాయంత్రం వంతెనపై వెలుగులు కనిపించడంతో పాదచారులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.



ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద నేతాజీ ఫ్లైఓవర్ పై విద్యుత్ లైట్లు అమర్చుతున్న సిబ్బంది

కూటమి నేతలకు చెక్ పెట్టాలి

డాబాగార్డెన్స్: గీత కార్మిక కులాలకు మద్యం దుకాణాల కేటాయింపు నోటిఫికేషన్ సత్వరమే జారీ చేయాలని గీత కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మద్యం పాలసీలో భాగంగా కల్లుగీత కార్మికుల కులాలకు 10 శాతం దుకాణాలు కేటాయించడంపై ఆయా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్లో శెట్టిబలిజ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు గుత్తుల మధుసూధన్ పలువురు సంఘ నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సుమారు 3,336 దుకాణాలకు అదనంగా 10 శాతం దుకాణాలు సంఖ్య పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, అయితే ఈ పెంచిన 10 శాతానికి సంబంధించి త్వరగా నోటిఫికేషన్ ఇవ్వనందున గీత కులాలు నష్టపోతారని తెలిపారు. ఈ కేటాయింపులకు సంబంధించిన వాటిలో కొంతమంది సిండికేట్లు దక్కించుకోవాలని చూస్తున్నారని, అలా జరగకుండా ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు దరఖాస్తుల అందజేత ప్రక్రియ వేగవంతమైందని, సిండికేట్, కూటమి పార్టీల నేతల ప్రభావం, ఒత్తిళ్లు అధికమయ్యాయని తెలుస్తోందన్నారు. తమ కులాలకు కేటాయిస్తామన్న దుకాణాల సంఖ్యకు నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఆలస్యమయ్యే కొద్దీ తాము నష్టపోయే ప్రమాదముందని, నోటిఫికేషన్ వెంటనే జారీ చేసి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలన్నారు.

10 శాతం దుకాణాల కేటాయింపు విషయంలో గీత కార్మికుల ఉప కులాలకే వ్యక్తిగతంగా దక్కేలా చూడాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంపై జోక్యం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జయరాం, శ్రీనివాస్, మేడిశెట్టి రమణ, దొమ్మేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గీత కార్మిక సంఘాల నాయకులు

అమ్మ పండగ..మదినిండుగా..!

దేవీ శరన్నవరాత్రులు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని ప్రధాన ఆలయాల్లో ఉత్సవాలను ప్రముఖులు ప్రారంభించారు. విశేష పూజలు..అలంకరణలతో అమ్మవారిని తీర్చిదిద్దారు. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నెల 12వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరపనున్నారు. దీంతో నియోజకవర్గం ఆధ్యాత్మికత కళకళలాడుతోంది.

- వైభవంగా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం
- ఆధ్యాత్మికత సంతరించుకున్న వైనం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ఇవో కె శోభారాణి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు శాస్త్రోక్తంగా పూజలు ప్రారంభించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించి దసరా ఉత్సవాలు ప్రారంభించారు. శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ కార్యనిర్వహణాధికారి శోభారాణి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు.



ఆదిలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి

ఆదిలక్ష్మి అలంకరణలో..

శరన్నవరాత్రి మహోత్సవాలు ఈ నెల 12వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. తొలి రోజు గురువారం మూలవిరాట్ వద్ద కనకమహాలక్ష్మి.. ఆదిలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజ నిర్వహించారు.

నేడు ధనలక్ష్మిగా..

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకమహాలక్ష్మి సోమవారం మూలవిరాట్ వద్ద ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారికి లక్ష చామంతులతో పూజ నిర్వహించనున్నారు.

గర్భాలయ ప్రవేశం లేదు..

శ్రీదేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకో అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్న నేపథ్యంలో ఆ సమయంలో భక్తులకు గర్భాలయ ప్రవేశం లేదని ఈవో శోభారాణి పేర్కొన్నారు.

స్వర్ణకవచాలంకృత కనకదుర్గా దేవిగా దుర్గాలమ్మ

నగరంలోని పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ అమ్మవారు స్వర్ణకవచాలంకృత కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి భక్తులతో పాటు మాలధారులు, భవానీమాతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఉదయం 8.30 గంటలకు కలశ స్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవో పైలా శేఖర్‌బాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా దుర్గాలమ్మ



బాలత్రిపురసుందరిదేవిగా కన్యకాపరమేశ్వరి



బాల త్రిపుర సుందరి దేవిగా ఉమాదేవి అమ్మవారు

బాల త్రిపుర సుందరిదేవిగా కన్యకాపరమేశ్వరి..

పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవాల ప్రారంభ సూచికగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కనక మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు వైశ్యుల 102 గోత్రీకులకు శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వేకువజామున మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం అమ్మవారిని బాలత్రిపురసుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవికి విగ్రహ ప్రధాత పాలూరి వర్ధనబాబు దంపతులు కంకణధారణ గావించి తొలి పూజ చేసి దసరా ఉత్సవాలు ప్రారంభించారు. దేవాలయ సంఘ మహిళా సభ్యులచే లలితా పారాయణం, బాల త్రిపురసుందరి జపం ఆలయ ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ సామూహికంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన వాసవీ కనకదుర్గాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమం నిర్వహించారు. అనంతరం వరహానరసింహ భజన మండలి ఆధ్వర్యంలో వాబ్బిలిశెట్టి రాధిక బృందంచే ప్రత్యేక గానామృతం కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంకట బాలాజీకుమార్ ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సువాసిని పూజలు

కన్యకాపరమేశ్వరికి శుక్రవారం లలితాదేవి రూపంలో అలంకరించనున్నారు. మహిళలచే సామూహిక సువాసిని పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ వర్గాలు తెలిపాయి.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి సన్నిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు అభిషేకాలు చేపట్టారు. యారాడ కొండపై వెలసిన శ్రీ సాగరగిరి కనకదుర్గ అమ్మవారు బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. అల్లిపురం వివేకానందకాలనీలో వెలసిన రాజాశ్యామల, అనఘాలక్ష్మీ, వారాహి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారాహి అమ్మవారు బాలా త్రిపుర సుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా దేవాలయ ఆవరణలో గోపూజా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ మేరు ట్రస్టు సభ్యులు పిసపాటి శ్రీనివాస సుబ్రమణ్య శాస్త్రి మాట్లాడుతూ విజయదశమి వరకు అమ్మవారు వివిధ రూపాలలో దర్శనమిస్తారని, ప్రతిరోజు కుంకుమ పూజలుంటాయని తెలిపారు. అస్సాంగార్డెన్స్‌లో వెలసిన శ్రీ నీలమ్మవేపచెట్టు అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమతో నిండిన నీళ్లతో అభిషేకం చేపట్టారు. చ్చియ్యమ్మపేటలో వెలసిన శ్రీ షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు.



33వ వార్డులో శరన్నవనరాత్రి పూజల్లో పాల్గొన్న భక్తులు



ఎర్నిమాంబ ఆలయంలో..



సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయంలో..

ఎర్నిమాంబ ఆలయంలో దేవి నవరాత్రులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ఆవరణలో దేవదాయ శాఖ కార్యానిర్వహణాధికారి డి.వి.ఎస్. సురేష్‌బాబా ఆధ్వర్యంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకాంతశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం నవ చండీ యాగం నిర్వహించారు. దుర్గాదేవిని బాల త్రిపురాసుందరిగా అలంకరించారు. కార్యక్రమంలో వాసుపల్లి విజయమ్మ, రామకృష్ణ, ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ తత్వంతోనే సమస్యలకు పరిష్కారం

మద్దిలపాలెం: సమాజంలో ఎదురవుతున్న సమస్యలకు గాంధీ తత్వంలోనే పరిష్కార మార్గాలు చూపవచ్చని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలోని గాంధీ అధ్యయన కేంద్రంలో ఏయూ న్యాయ కళాశాల నిర్వహిస్తున్న ఇష్యూస్ అండ్ చాలెంజెస్ ఆఫ్ జెండర్ జస్టిస్ అండ్ ఈక్వాలిటీ ఏ గాంధీయన్ పర్‌స్పెక్టివ్ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏయూ విశ్రాంత రెక్టార్ ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గాంధీజీ దేశ ప్రజలను ఐక్యం చేసి స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపించిన విధానాన్ని వివరించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంతి ఉప కులపతి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ గాంధీజీలోని నాయకత్వ లక్షణాలు యువతకు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ సత్యం, అహింసా, ఓర్పు అనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహరావు, న్యాయ కళాశాల ఎమిరిటస్ ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ఆచార్య ప్రసన్నకుమార్, ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్య



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

మద్దిలపాలెం: పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలని, తద్వారా యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావు అన్నారు. వరల్డ్ నేచర్ డేను పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ ఉపాధ్యాయులుగా బీఈడీ, ఎంఈడీ విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. వృక్షాలు మానవాళి మనుగడకు ముడిపడి ఉంటాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.